AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
11-12-2025 (thursday)
MAIN EDITION

## సోనియా, రాహుల్‌తో సీఎం రేవంత్, పార్టీ ఎంపీల భేటీ




**అక్షరటుడే, ఢిల్లీ:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకలను తెలంగాణ ముఖ్యనేతలు కలిశారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు ఎంపీలు వారితో భేటీ అయ్యారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై సోనియా, రాహుల్, ప్రియాంకలకు సీఎం రేవంత్ వివరించినట్లు తెలుస్తోంది. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమిట్, పెట్టుబడుల వివరాలను సోనియాకు ఆయన వివరించినట్లు సమాచారం.

## భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు..



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం తెల్లవారుజామున ఆసిఫాబాద్‌లో 5.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి 5.5, ఆదిలాబాద్ 6.1, సిద్దిపేట 6.4, సంగారెడ్డి 6.5, వికారాబాద్ 6.7, నిర్మల్ 7.3, కామారెడ్డి 7.3, నారాయణపేట 7.3, జగిత్యాల 7.5, సిరిసిల్ల 7.7, మెదక్ 7.8, పెద్దపల్లి 7.8, నిజామాబాద్‌లో 8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో సైతం చలి పంజా విసురుతోంది.

## మంత్రులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం



**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పలువురు మంత్రులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి మంత్రులు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే ఎలా? అని ప్రశ్నించారు. మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.

## ఆ ప్రయాణికులకు ట్రావెల్ వోచర్లు




**అక్షరటుడే, హైదరాబాద్:** సంక్షోభంలో చిక్కుకున్న దేశీయ విమానయాన సంస్థ ఇండిగో.. పూర్తిస్థాయిలో కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. గురువారం నుంచి 1950కి పైగా సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించింది. అదే సమయంలో సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బంది పడిన ప్రయాణికులకు రూ.10వేల విలువైన వోచర్‌ను పరిహారం కింద ఇస్తామని తెలిపింది.

## లాభాల బాట పట్టిన సూచీలు



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో మూడు రోజుల నష్టాలకు తెరపడింది. గురువారం ప్రధాన సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 428 పాయింట్లు, నిఫ్టీ 140 పాయింట్లు పెరిగాయి. సెన్సెక్స్ డెరివేటివ్స్ వీక్లీ ఎక్స్‌పైరీ నేపథ్యంలో మార్కెట్ తొలుత అస్థిరంగా కదలాడినా.. తర్వాత కోలుకుంది. ఈ క్రమంలో మూడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది.

## గోల్డ్ కార్డు వీసా విక్రయాలు ప్రారంభం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గోల్డ్ కార్డు వీసాల పంపిణీని ప్రారంభించారు. అగ్రరాజ్యం పౌరసత్వం పొందాలనుకునే సంపన్నుల కోసం దీనిని ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. వైట్ హౌస్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో తాజాగా వాటిని ప్రారంభించారు. అమెరికా అధ్యక్షుడిగా రెండో సారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ వలసదారులపై కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. అక్రమ వలసదారులను పంపించడంతో పాటు వీసా జారి నిబంధలను కఠినతరం చేశారు. హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును కూడా భారీగా పెంచారు. అయితే దేశంలో భారీగా పెట్టుబడులు పెట్టే వారికి గోల్డ్ కార్డు వీసా జారీ చేస్తామని గతంలో ఆయన ప్రకటించారు.

## ఎయిర్‌పోర్టులో బంగారం, గంజాయి పట్టివేత

**అక్షరటుడే, ముంబై:** ముంబై ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారులు భారీగా గంజాయి, బంగారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న పలువురు ప్రయాణికుల నుంచి వీటిని సీజ్ చేశారు. బ్యాంకాక్ నుంచి వివిధ విమానాలలో వచ్చిన 12 మంది ప్రయాణికులను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డిసెంబర్ 3 నుంచి 10 మధ్య నిర్వహించిన ఆపరేషన్లలో వీటిని స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ సిబ్బంది తొమ్మిది మంది ప్రయాణికులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.37.26 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఓ అధికారి తెలిపారు.



# ప్రశాంతంగా పల్లె పోరు

- ముగిసిన తొలి విడత ఎన్నికలు
- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం
- ఉదయం నుంచే ఓటర్ల బారులు
- 75 శాతానికి పైగా పోలింగ్ నమోదు
- మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్

**తొలి విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. ఉదయం నుంచే జనం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. చాలాచోట్ల నిర్దేశిత గడువు తర్వాత కూడా ఓటర్లు లైన్లలో ఉండడంతో వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 75 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. చెదురుమదురు ఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా పూర్తి కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత కౌంటింగ్ చేపట్టి ఫలితాలను ప్రకటించారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**


తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లోని 189 మండలాల పరిధిలో 4,236 సర్పంచ్, 37,440 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, 396 సర్పంచ్, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,834 సర్పంచ్ స్థానాల కోసం 12,960 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయా గ్రామాల్లో పోలింగ్ నిర్వహించగా, ఓటర్లు తరలి వచ్చారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. దీంతో భారీగా భారీగా ఓటింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకే రాష్ట్ర వ్యాప్తంగా కలిపి 60 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు ఈసీ తెలిపింది. ఒంటి గంట తర్వాత కూడా జనం లైన్లలో ఉండడంతో వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించినట్లు పేర్కొంది.

### కనిపించని అభ్యర్థి గుర్తు.. ఆగిన పోలింగ్..

నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామ పంచాయతీలోని పదో వార్డులో అభ్యర్థికి గుర్తు కేటాయించకపోవడంతో పోలింగ్ నిలిచిపోయింది. ఆ వార్డులో మొత్తం ముగ్గురు అభ్యర్థులు పోటీ చేయగా.. ఇద్దరికి సంబంధించిన గుర్తులు మాత్రమే బ్యాలెట్ పత్రాల్లో కనిపించాయి. మరో అభ్యర్థికి సంబంధించిన గుర్తు కేటాయించకపోవడంతో గమనించిన ఓటర్లు షాక్ కు గురయ్యారు. ఒక అభ్యర్థికి గుర్తు కేటాయించక పోవడం తో మూడో అభ్యర్థి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయగా.. పోలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆ తర్వాత వేరే బ్యాలెట్ పత్రాలు తీసుకొచ్చి, ఓట్ల ప్రక్రియ చేపట్టారు.

### పలుచోట్ల తీవ్ర ఉద్రిక్తత..

ఎన్నికల సందర్భంగా పలుచోట్ల కాస్త ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ కేంద్రాల్లోనే ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో ప్రత్యర్థుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, డెయిరీ కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. కేతెపల్లి మండలం కుర్లపల్లిలో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. నలుగురికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.



## అఫ్గాన్‌పై పాక్ దాడులను ఖండిస్తున్నాం: భారత్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులకు పాల్పడడాన్ని భారత్ ఖండించింది. చిన్నారులు, మహిళలు, క్రికెటర్లపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. ఐరాస భద్రతా మండలి చర్చలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న అఫ్గాన్‌పై బెదిరింపులు, యుద్ధచర్యలు వంటివి అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని.. దీన్ని ఖండిస్తున్నామని అన్నారు.



## లోక్‌సభలో ఈ–సిగరెట్ వివాదం

**అక్షరటుడే, ఢిల్లీ:** పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో లోక్‌సభలో ఈ-సిగరెట్ ధూమ పానం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. క్వశ్చన్ అవర్ సందర్భంగా ఎంపీ అనురాగ్ ఠాకూర్ సంచల న వ్యాఖ్యలు చేశారు. కొందరు టీఎం సీ మహిళా సభ్యులు లోక్‌సభ ప్రాంగణంలోనే ఈసిగరెట్లు తాగుతుండగా తాను గమనించానన్నారు. దేశంలో ఈ-సిగరెట్లపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ, దేశ చట్టసభలో ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు.



## రిసార్ట్స్‌లో ప్రగ్యా హొయలు..

**ప్రగ్యా జైస్వాల్.. సినిమాల కంటే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ప్రేక్షకులను అలరించే ఈ ముద్దుగుమ్మ.. ఎప్పటికప్పుడు తన హాట్ ట్రీట్‌తో కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టిస్తుంది. తాజాగా ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి వెకేషన్‌లో భాగంగా ఒక రిసార్ట్‌కు వెళ్లింది. అక్కడ హాట్ ఫోజులతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోందని చెప్పవచ్చు. తాజాగా ఇంస్టాగ్రామ్ వేదికగా ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**

## ప్రభాకర్ రావు సిట్ ఎదుట లొంగిపోవాలి: సుప్రీం



**అక్షరటుడే, ఢిల్లీ:** తెలంగాణలో సంచలనం రేకెత్తించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో అధిపతి ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. రేపు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ‘సిట్’ ముందు బేషరతుగా లొంగిపోవాలని ఆదేశించింది. అదే సమయంలో, అరెస్టు అనంతరం ఆయనను ఫిజికల్ టార్చర్ చేయకూడదని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేసుతో సంబంధం ఉన్న కీలక ఐఫోన్‌లకు చెందిన క్లౌడ్ ఖాతాల పాస్‌వర్డ్‌లను పూర్తిగా మార్చేసి, ఏ మాత్రం సమాచారం అందజేయకుండా అడ్డుకుంటున్నారని సిట్ అధికారులు ప్రభాకర్ రావుపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఇచ్చిన మధ్యంతర అరెస్ట్ ఉపశమనాన్ని రద్దు చేయాలని కోరుతూ ప్రత్యేక దర్యాప్తు బృందం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

## పెరిగిన బంగారం ధర..



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** దేశీయంగా బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి ధరలు పెరిగాయి. దీంతో బంగారం ధరలు స్వల్ప మొత్తంలో పెరగ్గా.. వెండి మాత్రం సరికొత్త గరిష్ఠాలను తాకింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో గురువారం మధ్యాహ్నం నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,19,350 పలుకుతోంది. కిలో వెండి ధర రూ.1,95,400 మార్కును చేరుకొని రూ.2 లక్షల దిశగా దూసుకెళ్తోంది.



## అఖండ 2 సినిమాకు మరో షాక్

**అక్షరటుడే, హైదరాబాద్:** నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తోన్న అఖండ2 సినిమాకు మరో షాక్ తగిలింది. అఖండ 2 సినిమాకు టికెట్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ హైకోర్టులో ఓ న్యాయవాది లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా విచారించిన కోర్టు.. ప్రీమియర్ షో రేట్లు పెంపు జీవోపై సస్పెన్షన్ విధించింది. ప్రీమియర్ షోలతో పాటు టికెట్లు రేట్ల పెంపు సర్క్యులర్‌ను రద్దు చేసింది. తెలంగాణ హోంశాఖ, అఖండ 2 సినిమా నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. అంతేకాదు.. తెలుగు ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. విచారణను రేపటికి వాయిదా వేసింది. కాగా.. అఖండ2 మూవీ వాస్తవానికి డిసెంబర్ 5న విడుదల కావాల్సి ఉండగా.. వాయిదా పడింది. ఎట్టకేలకు డిసెంబర్ 12న రిలీజ్ చేయనున్నారు.